జనపథం - జనపదం

(*జనులు నడిచే బాట ... జనులు నుడివే మాట*)

# అవతారములు - నిత్యానంద్.

"ఒరేయ్ రామూ! కమలాకర్‌ని చూసావా?" అన్నాడు గోపి.
"వాడా! వాడో అవతారంగాడు." సమాధానమిచ్చాడు రాము.
*ఇక్కడ అవతారం అంటే 'అయోమయంగా చరించేవాడు' అన్న అర్థములో వాడడం జరిగింది. ప్రక్కన ఏమైనా పట్టించుకోని ఆబ్సెంట్‌మైండెడ్ ప్రొఫెసర్ (AMP) లాగ అన్నమాట.*

"శీనూ! శీనూ!! ... అమ్మో! శీను ఎక్కడికెళ్ళాడే?" అడిగింది శారద.
"వాడో బుద్ధావతారం! ఆ గదిలోనే ఏ మూలనో కూర్చొని ఉంటాడు. చూడు." విసుగ్గా సమాధానం చెప్పింది లక్ష్మి.
*ఇక్కడ బుద్ధావతారం అనేది జడత్వం హెచ్చుగా ఉన్నవారికి ఇచ్చే బిరుదుగా వాడడం జరిగింది.*

"ఒరేయ్ రామం! ఏమిట్రా ఆ దొర్లడం ... వరహావతారం ఎత్తినట్లు." అన్నది కాంతమ్మ.
*ఇక్కడ వరహావతారం అంటూ అశుభ్రంగా ఉండడాన్ని ఎత్తి పొడవడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే - చెడును ఎత్తి పొడవడానికే ఈ అవతారములను వాడడం సాధారణమై పోయింది.*

వాడు శ్రీరామచంద్రుడండి అని ఈనాడెవరైనా అన్నారంటే, అది ఏకపత్నీవ్రతుడనో, సుగుణ సంపన్నుడనో అనడం లేదు. పప్పుముద్దలాగ అచేతనంగా ఉంటాడనే ఉద్దేశ్యంతో వాడుతున్నారు. వాడు సాక్షాత్తూ శ్రీకృష్ణుడే అంటే చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాడని అంతరార్థం. సరే! విషయానికి వద్దాం.

మనిషి ప్రతిరోజూ ఎన్నెన్నో అవతారములు ఎత్తుతున్నాడు. ఆశ్చర్యం కలుగుతున్నదా? ఒక మహిళ భార్యగా, తల్లిగా, ఉద్యోగినిగా, కూతురిగా, అత్తగా, సోదరిగా, స్నేహితురాలిగా; ఒక వ్యక్తి భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా, కుమారునిగా, మామగా, సోదరునిగా, స్నేహితునిగా ఎన్నో పాత్రలను విజయవంతముగా పోషించడం మనకు తెలియనిది కాదు. ఏ అవతారాన్ని బట్టి ఆ పాత్రలో ఇమిడి పోవడము (ఇంకో రకముగా చెప్పాలంటే పరకాయ ప్రవేశం చెయ్యడం) లో అందెవేసిన చెయ్యిగా నిలిచిన మనము భగవంతుని అధిగమించడానికి ప్రయత్నం చేస్తున్నాము. భగవంతుడైనా అవతారముతో పని ముగియగానే వైకుంఠం చేరుకుంటున్నాడు. కాని భర్త అవతారమెత్తిన వ్యక్తి, భార్యను పరిగెత్తించి, తరువాత తండ్రి అవతారం దాల్చి పిల్లలను అదిలించి, ఉద్యోగి అవతారంలో ముఖముపై లేని నవ్వును (ప్లాస్టిక్ నవ్వును) పులుముకొని, సాయంత్రం ఇంటికి రాగానే మళ్ళీ భర్త అవతారమెత్తి (కార్యాలయములో ఒత్తిడికి లోనైతే, ఉగ్రనరసింహావతారంతో, ఆనందం పొందితే చిలిపి కృష్ణుని అవతారాన్ని దాల్చడం నిత్య సత్యం) - ఒక మాస్క్ తీసి ఇంకొకటి తగిలించుకోవడం సర్వ సాధారణం.

మన పెద్దలు చెప్పినట్లు, ఏ పాత్రనైనా ప్రేమతో పోషిస్తే, మిగతా పాత్రలను కూడా వారిని వారుగా గుర్తిస్తే - అదే కదా ప్రేమావతారం.

*